ఆదివారం 30-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 380, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD


మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..


Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com




ఇక ట్రూ కాలర్ అవసరం లేదు..

వివరాలు 3లో



బీహార్‌లో వరుసగా కూలుతున్న బ్రిడ్జిలు

వివరాలు 3లో



అంతరిక్షంలోనే చిక్కుకున్న సునీతా విలియమ్స్

వివరాలు 3లో



బాలికలలో ఈ మార్పుకు కారణమిదే

వివరాలు 5లో

## లేహ్‌లో కొట్టుకుపోయిన యుద్ధ ట్యాంక్

### ఐదుగురు భారత సైనికులు మృతి



ముందడుగు జాతీయం:

చైనా సరిహద్దు ఉన్న నదిలో యుద్ధ ట్యాంక్(T-72 tank) కొట్టుకుపోయింది. దాంట్లో అయిదుగురు సైనికులు ఉన్నారు. వారిలో ఓ జేసీవో ఆఫీసర్ ఉన్నారు. నియంత్రణ రేఖ వద్ద లేహ్‌లో ఉన్న దౌలత్ బేగ్ ఓల్డీ ఏరియా వద్ద ఈ ఘటన జరిగింది. రెస్క్యూ అధికారులు ఒకరి మృతదేహాన్ని వెలికితీశారు. మరో నలుగురు గల్లంతయ్యారు. ప్రమాదంలో మరణించిన వారిలో జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్ ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. శిక్షణలో ఉన్న సైనికులు.. మందిర్ మోర్చ్ వద్ద ఉన్న బోధి నదిలో యుద్ధ ట్యాంక్‌తో క్రాస్ చేస్తున్నారు. ఆ సమయంలో ఆ ట్యాంక్ కొట్టుకుపోయింది. లేహ్ నుంచి 148 కిలోమీటర్ల దూరంలో ఆ ట్యాంక్ ఉన్నది. టీ-72 యుద్ధ ట్యాంక్ ప్రమాదంలో కొట్టుకుపోయింది. ట్రైనింగ్ జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా నీటి మట్టం పెరిగినట్లు అధికారులు చెప్పారు. ఉప్పొంగుతున్న నదిలో యుద్ధ ట్యాంక్‌తో పాటు సైనికులు నీట మునిగి మరణించారు. భారతీయ ఆర్మీ సైనికుల మృతి పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సంతాపం తెలిపారు. దురదృష్టకర సంఘటన జరిగినట్లు తన ఎక్స్ అకౌంట్‌లో వెల్లడించారు. దేశం కోసం విరోచిత సేవలు అందించిన ఆ సైనికులను ఎన్నటికీ మరిచిపోలేమన్నారు. బాధిత కుటుంబసభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో దేశం ఆ కుటుంబాలకు అండగా ఉంటుందని మంత్రి రాజ్‌నాథ్ వెల్లడించారు.

అన్ని రంగాల్లో వరంగల్‌ను

## అభివృద్ధి చేస్తా

- నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి



ముందడుగు వరంగల్:

హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని, వరంగల్ అభివృద్ధికి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వరంగల్ పర్యటనలో ఉన్న ఆయన నగర అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్డుకు భూసేకరణ పూర్తి చేయాలని, దానికి మిగతా 2లో

## ఏఐ వాయిస్ ఉపయోగించి మహిళ మోసం


03

## బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి

వివరాలు 2లో

## ఢిల్లీలో వర్షాలకు 10కి చేరిన మృతులు

### దాదాపు అన్ని ప్రాంతాలు నీట మునిగాయి



ముందడుగు ఢిల్లీ:

దేశ రాజధానిలో ఢిల్లీలో ఐఎండి అంచనాలకు మించి వర్షాలు కురుస్తున్నాయి. వాయువ్య ఢిల్లీలో కరెంట్ షాక్ తో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. శుక్రవారం తెల్లవారు జామున వసంత్ విహార్‌లో గోడ కూలి ఐదుగురు మరణించారు. ముగ్గురు కార్మికుల మృతదేహాలను వెలికితీశారు. దీంతో ఢిల్లీ అంతటా వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మిగతా 2లో

## దేశ వ్యాప్తంగా నీట్ రద్దు చెయ్యండి

### ప్రధాని, 8 మంది సీఎంలకు స్టాలిన్ లేఖ



ముందడుగు తమిళనాడు:

దేశ వ్యాప్తంగా నీట్, యూజీసీ నెట్ పరీక్షల అవకతకలపై వివాదం కొనసాగుతున్న వేళ తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. ప్రధాని మోదీతో పాటు ఎనిమిది మంది సీఎంలకు లేఖ రాశారు. వైద్య విద్యా సంస్థల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష (నీట్) విధానాన్ని రద్దు చేయాలని సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మిగతా 2లో

ముందడుగు
ఆదివారం,
30-6-2024,
హైదరాబాద్

# అన్ని రంగాల్లో వరంగల్‌ను అభివృద్ధి చేస్తా

మొదటిపేజీ తరువాయి

అవసరమైన నిధుల వివరాలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. హైవేలను అనుసంధానిస్తూ వరంగల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఆర్ నుంచి టెక్స్‌టైల్ పార్కును అనుసంధానించాలని చెప్పారు. స్మార్ట్‌సిటీలో భాగంగా భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి చేయాలని, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన.. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

# బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి

- తమ డిమాండ్లు ముందు పెట్టిన జేడీయూ
- తీర్మానాన్ని ఆమోదించిన పార్టీ

ముందడుగు బీహార్:

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా కాకముందే నీతీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ పార్టీ తమ డిమాండ్లకు తెరతీసింది. తమ రాష్ట్రం బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగింది. ఈమేరకు పార్టీ సమావేశంలో దీనిపై తీర్మానం చేసింది. జనతాదళ్ (యునైటెడ్) జాతీయ కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఇందులో బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా ఆర్థిక ప్యాకేజీని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తీసుకొచ్చిన తీర్మానాన్ని పార్టీ ఆమోదించింది. దీంతోపాటు ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేసింది. పరీక్షల్లో అక్రమాలను నివారించేందుకు పార్లమెంట్‌లో ప్రత్యేక, కఠినచట్టం చేయాలని కోరింది.



బిహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ఓ తీర్మానాన్ని రాష్ట్ర కేబినెట్ గతేడాది నవంబరులో ఆమోదించింది. అయితే, అప్పటికి నీతీశ్ కుమార్.. ఆర్జేడీ, కాంగ్రెస్ మద్దతుతో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. ఈ ఏడాది జనవరిలో ఈ కూటమికి గుడ్‌బై చెప్పిన సీఎం.. మళ్లీ భాజపా గూటికి చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కేంద్రంలో ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా మారారు. 12 మంది సభ్యుల బలంతో కూటమిలో మూడో అతిపెద్ద పార్టీగా జేడీయూ ఉంది. ఈ క్రమంలోనే 'ప్రత్యేక హోదా' అంశాన్ని నీతీశ్ పార్టీ తాజాగా లేవనెత్తడం ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం అనంతరం జేడీయూ సీనియర్ నేత ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. ''బిహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ కొత్తదేమీ కాదు. రాష్ట్ర వృద్ధి పథాన్ని వేగవంతం చేయడం, సవాళ్లను పరిష్కరించడంలో ఇది కీలకమైన దశ'' అని అన్నారు. ఇక, ఇదే సమావేశంలో పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సీనియర్ నేత సంజ్‌ఝాను ఎన్నుకొన్నారు.

# ఢిల్లీలో వర్షా లకు 10కి చేరిన మృతులు

మొదటిపేజీ తరువాయి


10కి పెరిగింది. నిన్న (జూన్ 28) దేశ రాజధాని ఢిల్లీని కుండ పోత వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. దాదాపు 100 ఏళ్లలో జూన్‌లో అత్యధిక వర్షపాతం ఇదే. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లకు ఢిల్లీలో దాదాపు అన్ని ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లన్నీ జలమయం..ఇండ్లు, వాహనాలు నీట మునిగాయి. చెట్లు కూలాయి.. ఎక్కడ చూసినా నీళ్లే.. రహదారులన్నీ నీటి మునగడంతో భారీగా ట్రాఫిక్ జామ్.గురువారం (జూన్28) ఈదురుగాలులతో కూడిన వర్షం.. ఢిల్లీ ఎయిర్ పోర్టు లో రెండు టెర్మినల్ పూర్తి కూలిపోయాయి. ఒకరు చనిపోయారు..వాహనాలు ధ్వంసమయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షా లకు ఈస్ట్ ఢిల్లీలో వీధుల్లో మోకాళ్లోతు నీరు చేరింది.వీధులన్నీ చెరువుల్లా కనిపించాయి. ఎక్కడ చూసినా మోకాళ్లోతు నీళ్లు.. కార్లు, బైకులు కొట్టుకుపోయాయి. సబ్ వేలు నీటమునిగాయి. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. వర్షా లతో ఢిల్లీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# ఏఐ వాయిస్ ఉపయోగించి మహిళ మోసం

## పురుషుడిలా మాట్లాడి రూ.6 లక్షలు దోపిడీ

ముందడుగు జాతీయం:

రోజురోజుకు టెక్నాలజీలో కొత్త, కొత్త మార్పులు వస్తున్నాయి. దానికి తోడు కృత్రిమ మేధస్సు నానాటికీ అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం అన్నిరంగాల్లో దీన్ని వినియోగిస్తున్నారు. అయితే.. ఈ సాంకేతికత ద్వారా కొందరు మోసాలకు తెర లేపుతున్నారు. తాజాగా ఓ మహిళ ఏఐ ద్వారా పురుషుడిలా వాయిస్ మార్చి మరో యువతిపై బెదిరింపులకు దిగింది. ఆమె నుంచి రూ.6 లక్షలకు పైగా కాజేసింది. ఈ ఘటన మహారాష్ట్రలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం థానే జిల్లాకు చెందిన ఓ మహిళ ఏఐను ఉపయోగించి ఈ మోసానికి పాల్పడింది. పురుషుడిలా తన పొరుగింటి యువతికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడింది. ఆమెను మానసికంగా ఇబ్బందులకు



గురిచేసింది. ఈ క్రమంలోనే బాధితురాలి నుంచి డబ్బు డిమాండ్ చేసింది. అలా రూ.6 లక్షలకు పైగా దోపిడీ చేసింది. వేధింపులు తాళలేని బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. ఏఐ సాంకేతికతతో ఇదంతా చేసింది పొరుగింటి మహిళ అని తెలిసి అంతా షాకయ్యారు. దీనిపై కేసు నమోదు చేసి శనివారం ఆ మహిళను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# దేశ వ్యాప్తంగా నీట్ రద్దు చెయ్యండి

మొదటిపేజీ తరువాయి

మోదీతో పాటు ఎనిమిది మంది సీఎంలకు లేఖ రాశారు.నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. వృత్తిపరమైన కోర్సుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా కాకుండా 12వ తరగతి మార్కుల ద్వారా మాత్రమే ఉండాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో తెలిపారు. నీట్.. విద్యార్థులపై అనవసర ఒత్తిడి అని ఆరోపించారు. అంతే కాకుండా నీట్ పరీక్ష రద్దు చేయడంపై ఇతర రాష్ట్రాలు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయని లేఖలో పేర్కొన్నారు. నీట్ నుంచి తమిళనాడును మినహాయించాలని, 12వ తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ అడ్మిషన్ల కోసం అసెంబ్లీలో ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించాలని వెల్లడించారు. మరో వైపు నీట్ రద్దు కోసం అసెంబ్లీలో ఇదే విధమైన తీర్మానాన్ని పరిశీలించాలని ఎనిమిది రాష్ట్రాల సీఎంలను స్టాలిన్ కోరారు. ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, పంజాబ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక సీఎంలకు ఈ మేరకు లేఖలు పంపారు.

# కల్కి 2898 ఏడీ మూవీపై రజనీకాంత్ ప్రశంసలు..!

## ఇండియన్ మూవీని మరో లెవల్‌కు తీసుకెళ్లారంటూ..!



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రం కల్కి 2898 ఏడీ మూవీ. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నది. ఇప్పటికే ఈ మూవీని చూసిన పలువురు సెలబ్రిటీలు స్పందించారు. ఈ మూవీ భారత సినిమాను మరో మెట్టు ఎక్కించిందంటూ ప్రశంసిస్తున్నారు. తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ సైతం చిత్ర బృందంపై ప్రశంసలు కురిపించారు. కల్కి మూవీని చూశానని రజనీకాంత్ తెలిపారు. సినిమా ఎంతో అద్భుతంగా ఉందంటూ అభినందించారు. భారతీయ చిత్రాన్ని డైరెక్టర్ నాగ్ అశ్విన్ మరో స్థాయికి తీసుకెళ్లారంటూ ప్రశంసలు కురిపించారు. చిత్రం భారీ హిట్ సాధించినందుకు బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, హీరో ప్రభాస్, కమల్ హాసన్, హీరోయిన్ దీపికా పదుకొనేతో పాటు చిత్రబృందానికి రజనీ అభినందనలు తెలిపారు. అలాగే, సెకండ్ పార్ట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానన్నారు. ఇదిలా ఉండగా.. కల్కీ 2898 ఏడీ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నది. ప్రీ బిజినెస్‌లో రాజమౌళి 'ఆర్ఆర్ఆర్' మూవీ రికార్డులు బద్దలుకొట్టింది. ఈ మూవీ తొలిరోజు దాదాపు రూ.191.9కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది. వారాంతం కావడంతో రెండురోజులు కలెక్షన్ మరింత పెరిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. కల్కీ పార్ట్-2 ఉండబోతుందని మూవీ క్లైమాక్స్‌లో వెల్లడించారు. పార్ట్-1 ఈ రేంజ్‌లో ఉంటే.. పార్ట్-2 మరో రేంజ్‌లో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ముందడుగు
ఆదివారం, 30-6-2024, హైదరాబాద్

# మీ భర్తలతో తాగుడు ఇలా మాన్పించండి

## మధ్యప్రదేశ్ మంత్రి కుశ్వాహా సూచన



ముందడుగు మధ్యప్రదేశ్: మద్యపానం పచ్చని సంసారాలను విచ్ఛిన్నం చేస్తోంది. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఎన్నో కుటుంబాలు నాశనం అవుతున్నాయి. మద్యపానం, మాదక ద్రవ్యాల వాడకాన్ని అరికట్టే లక్ష్యంతో నిర్వహించిన కార్యక్రమంలో మధ్యప్రదేశ్ మంత్రి నారాయణ్ సింగ్ కుశ్వాహా ఓ సూచన చేశారు.

నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.."ఆడవారు తమ ఇంట్లోని పురుషులు మద్యం మానేయాలని కోరుకుంటే.. ముందుగా వారిని బయట తాగొద్దని చెప్పండి. ఆ మద్యాన్ని ఇంటికి తెచ్చుకొని, మీ ముందు కూర్చొని తాగమని చెప్పండి. వారు కుటుంబసభ్యుల ముందు తాగితే.. ఆ అలవాటు వారిలో క్రమంగా తగ్గడం ప్రారంభం అవుతుంది. తర్వాత రోజుల్లో దానికి పూర్తిగా దూరం అవుతారు. వారు తమ భార్యాపిల్లల ముందు తాగడానికి సిగ్గుపడతారు. దానిని పిల్లలు చూస్తే వారు కూడా అదే దారిలో నడిచే ప్రమాదం ఉంటుందని వారికి గుర్తుచేయండి. ఈ పద్ధతి బాగా పని చేయొచ్చు" అని అన్నారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. దీనిపై కాంగ్రెస్ స్పందించింది. "మంత్రి ఉద్దేశం బాగానే ఉన్నప్పటికీ.. ఆయన దానిని చెప్పిన విధానం సరిగా లేదు. ఇంట్లో మద్యం తాగడం వల్ల ఆ ఇల్లు గృహహింసకు కేంద్రంగా మారుతుంది. ఈ సలహా బదులుగా అసలు తాగొద్దని చెప్తే బాగుండేది" అని భిన్నాభిప్రాయం వ్యక్తం చేసింది.

# ఇక ట్రూ కాలర్ అవసరం లేదు..

- జూలై 15వ తేదీ నుంచి కొత్త సేవలు
- కీలక నిర్ణయం తీసుకున్న ట్రాయ్




ముందడుగు జాతీయం: తెలియని వ్యక్తులు, అన్‌నోన్ నెంబర్స్ నుంచి కాల్స్ వస్తే ఎవరు చేశారో తెలుసుకునేందుకు ట్రూ కాలర్ యాప్ అందుబాటులో ఉంది. దానితో పాటు ఎన్నో యాప్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని ఉపయోగించే సమయంలో కన్ని రకాల సమస్యలు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా ఇలాంటి థార్డ్ పార్టీ యాప్స్‌ను ఉపయోగిచే సమయంలో మీ ఫోన్ కాల్స్‌కి సంబంధించిన పర్మిషన్స్ యాప్ వాళ్లకు ఇవ్వాల్సి ఉంటుంది. మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్ తో పాటు కాల్ వివరాలను సదరు యాప్స్‌కు చేరుతాయి.

అయితే ఇలాంటి సమస్య లేకుండా, అసలు ఏ యాప్ అసవరం లేకుండానే ఇకపై అన్‌నోన్ నెంబర్స్ నుంచి వచ్చే కాల్స్‌ను తెలుసుకోవచ్చు. ఇందుకోసమే టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మీకు వచ్చే కాల్స్ వివరాలు ఏ యాప్ అవసరం లేకుండా స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతాయి. దీంతో మీకు ఎవరు కాల్ చేశారో తెలుసుకోవచ్చు. ఇందుకోసం ట్రాయ్.. నేమ్ ప్రెజెంటేషన్ సర్వీస్‌ను యాక్టివేట్ చేయనుంది. జూలై 15వ తేదీ నుంచి ఈ సేవలను ట్రాయ్ ప్రారంభించనుంది.

# బీహార్‌లో వరుసగా కూలుతున్న బ్రిడ్జిలు

## శుక్రవారం మధుబని ప్రాంతంలో కూలిన మరో వంతెన



ముందడుగు బీహార్: బీహార్‌లో వరుసగా బ్రిడ్జిలు కూలుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే వరుసగా నాలుగు బ్రిడ్జిలు కూలిపోయిన విషయం తెలిసిందే. గురువారం కిషన్‌గంజ్ జిల్లాలో, జూన్ 23న తూర్పు చంపారన్ జిల్లాలో, 22న సిశాన్‌లో, 19న అరారియాలో ఇలాగే వంతెనలు కూలిపోయాయి. తాజాగా మరో బ్రిడ్జి కూలింది. శుక్రవారం మధుబని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. దాదాపు రూ.3 కోట్ల వ్యయంతో 75 మీటర్ల పొడవైన ఈ వంతెనను బీహార్ గ్రామీణ పనుల విభాగం 2021 నుంచి నిర్మిస్తోంది. ఇది మధుబని – సుపౌల్ జిల్లాల మధ్య భూతాహి నదిపై ఉంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షా ల కారణంగా భూతాహి నదిలో నీటి మట్టం పెరిగింది. నీటి ఉధృతికి నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. రాష్ట్రంలో గత తొమ్మిది రోజుల వ్యవధిలోనే ఇది ఐదో ఘటన కావడం గమనార్హం. దీంతో నిర్మాణ పనుల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వరుసగా వంతెనలు కూలిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదులు, కాలువలపై నిర్మించిన వంతెనల పటిష్టతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పబ్లిక్ వర్క్స్‌లో నాణ్యతా లోపాలు, అక్రమాల వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. వరుస ప్రమాదాలతో అధికారులు కూడా ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదవశాత్తు కూలిపోయాయా..? లేక ఎవరైనా కావాలనే కూల్చి వేస్తున్నారా..? అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

# అంతరిక్షంలోనే చిక్కుకున్న సునీతా విలియమ్స్

- తిరిగి భూమికి రావడంపై అనుమానాలు
- తాజా అప్ డేట్ ఇచ్చిన నాసా



ముందడుగు జాతీయం: అంతరిక్షంలోకి బోయింగ్ స్టార్ లైనర్ నౌకతో వెళ్లిన వ్యోమగామి సునీతా విలియమ్స్ తిరిగి భూమికి రావడంపై అనుమానాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఆమె వెళ్లిన స్టార్ లైనర్ నౌకలో తలెత్తిన ఇబ్బందుల కారణంగా వెంటనే భూమికి తిరుగు ప్రయాణం కావడం కష్టంగా మారింది. దీంతో అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీనిపై తాజా అప్ డేట్ ఇచ్చింది. స్టార్ లైనర్ మిషన్ గడువును 45 రోజుల నుంచి 90 రోజులకు పెంచింది. దీంతో సునీత ఇప్పట్లో భూమికి రావడం కష్టమేనన్న వాదన వినిపిస్తోంది.

జూన్ ప్రారంభంలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన స్టార్ లైనర్ నౌక.. హీలియం లీక్‌లు, థ్రస్టర్ అంతరాయాలతో సమస్యలను ఎదుర్కొంది. దీంతో అందులో అంతరిక్షానికి వెళ్లిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ తో పాటు బుచ్ విల్మోర్‌లను భూమికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు నాసా ప్రయత్నిస్తోంది. స్టార్ లైనర్ నౌక భూమికి తిరిగివచ్చే కచ్చితమైన తేదీ చెప్పలేమని నాసా చెబుతోంది.

స్టార్ లైనర్ నౌకలో ఎదురైన సమస్యలను అధ్యయనం చేసేందుకు నాసా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా స్టార్ లైనర్ మొదటి దశలో కొన్ని థ్రస్టర్ లు ఎందుకు విఫలమయ్యాయో తాము ఇంకా పరిశీలిస్తున్నట్లు నాసా తెలిపింది. ఈ అధ్యయనం పూర్తి అయితే తప్ప స్టార్ లైనర్ నౌకను భూమికి తిరిగి వచ్చేందుకు తేదీని నిర్ణయించలేమని వెల్లడించింది. హడావిడిగా భూమికి స్టార్ లైనర్ ను తీసుకొచ్చేందుకు తాము ప్రయత్నించడం లేదని పేర్కొంది. దీంతో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ మరికొంతకాలం అంతరిక్షంలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి.

ముందడుగు
ఆదివారం, 30-6-2024, హైదరాబాద్

# వైద్యులు తప్పు చేస్తారు.. సమర్థించుకుంటారు

## బాలుడి కాలుకు సర్జరీ బదులు సున్తీ చేశారు

ముందడుగు మహారాష్ట్ర

కొంతమంది ప్రభుత్వ వైద్యుల పనితీరు మరీ అధ్వాన్నంగా ఉంటుంది. మళ్లీ చేసిన తప్పును సమర్థించుకుంటారు. గాయపడిన బాలుడి కాలుకు సర్జరీ బదులు డాక్టర్లు సున్తీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పొరపాటు జరిగింది. ఇది తెలిసి షాకైన బాలుడి తల్లిదండ్రులు వైద్యాధికారులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డాక్టర్ల తప్పు, నిర్లక్ష్యంపై దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. షాహాపూర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు ఆడుకుంటుండగా కాలుకు గాయమైంది. దీంతో బాలుడి తల్లిదండ్రులు జూన్ 15న షాహాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ బాలుడి కాలుకు సర్జరీ బదులు సున్తీ చేశారు. జరిగిన పొరపాటు తెలుసుకున్న డాక్టర్లు గాయమైన కాలుకు కూడా శాస్త్రచికిత్స చేశారు. ఇది తెలిసి బాలుడి పేరెంట్స్ షాక్ అయ్యారు. వైద్యాధికారులతోపాటు షాహాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే రోజు అదే వయస్సున్న ఇద్దరు బాలురకు సర్జరీ చేయాల్సి ఉండటంతో తమ కుమారుడికి పొరపాటున సున్తీ చేసి ఉంటారని ఆరోపించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు ప్రయత్నించారు. బాలుడి ప్రైవేట్ భాగంలో కూడా సమస్య ఉందని వైద్యాధికారి గజేంద్ర పవార్ తెలిపారు. దీంతో ఆ బాలుడికి రెండు ఆపరేషన్లు చేయాల్సి వచ్చిందన్నారు. అయితే డాక్టర్లు ఒక సర్జరీ గురించి మాత్రమే బాలుడి పేరెంట్స్‌కు చెప్పి ఉంటారని, రెండో ఆపరేషన్ గురించి చెప్పడం మరిచి ఉంటారని అన్నారు.

# సత్తన్న జీవితం ఆదర్శప్రాయం

## పిఆర్టీయు రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి

ముందడుగు ములుగు

దేవులపల్లి సత్యనారాయణ జీవితం ఎందరో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఆదర్శమని పిఆర్టీయు రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఏటూరు నాగారం మండలంలోని ఆకునూరు గణపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న దేవులపల్లి సత్యనారాయణ గారి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తన్న ఒక ఆదర్శప్రాయుడు మాట కటువుఇగా మాట్లాడిన మనసు వెన్న లాంటిదని నిర్మొహమాటంగా నిక్కచ్చితంగా మాట్లాడడం ఆయన సొంతమని



అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని మాట్లాడుతూ "వ్యక్తి తనకోసం తాను జీవిస్తే తనతోనే మిగిలిపోతారని కానీ ప్రజల కోసం జీవిస్తే ప్రజలలో నిలిచిపోతారని అందుకు తార్కాణం సత్యనారాయణ సార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వేం యాకూబ్ రెడ్డి, రేగూరి సుభాకర్ రెడ్డి, కాసర్ల రమేష్, వెంకటాపురం మండల అధ్యక్షులు కోకిల శ్రీరంగం, ములుగు మండల అధ్యక్షులు సాని కొమ్ము వెంకటేశ్వర రెడ్డి తదితర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కేజ్రీవాల్‌కు 14 రోజులు సీబీఐ కస్టడీ

## ఢిల్లీ న్యాయస్థానం ఆదేశాలు జారీ

ముందడుగు ఢిల్లీ

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను 14 రోజుల పాటు సీబీఐ జ్యుడీషియల్ కస్టడీకి అనుమతిస్తూ ఢిల్లీ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సీబీఐ చేసిన విజ్ఞప్తికి కోర్టు శనివారం అంగీకారం తెలిపింది. విచారణ సమయంలో కేజ్రీవాల్ సరిగా సహకరించలేదని సీబీఐ రిమాండ్ దరఖాస్తులో కోర్టుకు తెలిపింది. నేరం నుంచి తప్పించుకునేందుకు సాక్ష్యాలకు విరుద్ధంగా సమాధానాలు ఇచ్చారని.. కొన్నింటికి అసలు సమాధానం చెప్పలేదని వెల్లడించింది. ఇదంతా ఉద్దేశపూర్వకంగా చేస్తున్నారని ఆరోపించింది. దీంతో మరికొన్ని



రోజుల పాటు కస్టడీకి అప్పగించాలని న్యాయస్థానాన్ని కోరింది. సీబీఐ అభ్యర్థనను పరిశీలించిన ఢిల్లీ న్యాయస్థానం.. కేజ్రీవాల్‌ను జులై 12 వరకు జ్యుడీషియల్ కస్టడీకి అనుమతించింది. ఆయనను ఆ రోజు కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించింది. అయితే.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరచనున్నట్లు తెలుస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థ అభ్యర్థించిన కొన్ని గంటలకే కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కాగా.. మనీలాండరింగ్ కేసులో కోర్టు అనుమతితో ఇప్పటికే ఆయన్ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

# కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూత

ముందడుగు హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ హైదరాబాద్‌లోని తన నివాసంలో తెల్లవారుజామున 3 గంటలకు ఆయన తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన డీఎస్ కాంగ్రెస్ పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. ఉమ్మడి ఏపీలో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు డీఎస్ మంత్రిగా సేవలందించారు. పీసీసీ అధ్యక్షుడిగానూ ఆయన పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2015లో భారాసలో చేరిన డీఎస్.. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అనంతరం మళ్లీ కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. డీఎస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో చిన్న కుమారుడు



ధర్మపురి అర్వింద్ ప్రస్తుతం భాజపా తరపున నిజామాబాద్ ఎంపీగా ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేశారు. 1948 సెప్టెంబర్ 27న జన్మించిన డీఎస్.. నిజాం కళాశాల నుంచి డిగ్రీ పూర్తిచేశారు. 1989లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలోకి దిగిన ఆయన.. నిజామాబాద్ నుంచి తొలి సారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. 1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐ అండ్ పీఆర్ మంత్రిగా.. 2004 నుంచి 2008 వరకు ఉన్నతవిద్య, అర్బన్ లాండ్ సీలింగ్ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2004, 2009 ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షునిగా ఉన్నారు. 2004లో తెరాసతో కాంగ్రెస్ పొత్తులో క్రియాశీలక పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో వైఎస్‌తో కలిసి పనిచేశారు.

ముందడుగు
ఆదివారం, 30-6-2024, హైదరాబాద్



# కొత్త ఆవిష్కరణలకు ఈ కాన్ఫరెన్స్ మూలం

■ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి వ్యాఖ్యలు
■ కాంటినెంటల్ ఆసుపత్రిలో గ్యాస్ట్రోఎంట్రాలజీ సమావేశాలు

ముందడుగు హైదరాబాద్
రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యాధునిక వైద్యసేవలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన కాంటినెంటల్ ఆసుపత్రిలోని గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో సరికొత్త ఆవిష్కరణలకు దోహదపడే జాతీయ గ్యాస్ట్రోఎంట్రాలజీ సమావేశాలను నిర్వహించింది. జన్యుశాస్త్రంలో వేగంగా వస్తున్న సరికొత్త ఆవిష్కరణలు, వాటి ద్వారా మారుతోన్న వైద్య విధానాలు మన భవిష్యత్ వైద్యరంగాన్ని మరో మెట్టు పైకి తీసుకెళ్లనున్నాయి. కాంటినెంటల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జీవి కాన్ఫరెన్స్ రాబోయే ఎన్నో కొత్త ఆవిష్కరణలకు మూలం కాబోతుందని కాంటినెంటల్ హాస్పిటల్స్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు. దాదాపు 450 కి పైగా పరిశోధనాత్మక ప్రచురణలు చేసిన రచయిత, అమెరికాకు చెందిన సుప్రసిద్ధ వైద్య, విద్యా కేంద్రమైన మయో క్లినిక్ లో పనిచేస్తున్న ప్రొఫెసర్ జాన్ కీసీల్, కాంటినెంటల్ హాస్పిటల్స్ కాన్ఫరెన్స్ హాల్లో... పెద్దప్రేగు క్యాన్సర్ కమ్యూనిటీస్ మీద ఎంతటి తీవ్ర ప్రభావం చూపుతుందోనని చెప్పిన ఆయన ప్రసంగాన్ని గురు ఎన్ రెడ్డి కొనియాడారు. ఇలాంటి ప్రసంగాలు రేపటి తరాలకు చాలా అవసరమన్నారు. మూడు రోజులపాటు జరిగిన ఈ జాతీయ గ్యాస్ట్రోఎంట్రాలజీ సదస్సులో వైద్యరంగానికి సంబంధించిన ఎన్నో మంచి మంచి విషయాల గురించి లోతుగా విశ్లేషించారు. ఈ కాన్ఫరెన్స్ లో పాల్గొనడం వల్ల మాకు చాలా కొత్త విషయాలు తెలిశాయని దేశ విదేశాల నుంచి వచ్చిన ప్రముఖులు సంతోషం వ్యక్తం చేశారు.

# బాలికలలో ఈ మార్పుకు కారణమిదే

■ చిన్న వయసులోనే పెద్దమనిషి అవుతున్నారు
■ ప్రధాన కారణాలలో జన్యు సంబంధం ఒకటి

ముందడుగు ప్రత్యేకం:
ప్రతి అమ్మాయి యుక్తవయస్సుకు చేరుకున్నప్పుడు ఋతుస్రావం అనేది సహజంగా జరిగే ప్రక్రియ. అయితే, కొంతమంది బాలికలు ఇతరులకన్నా ముందు వయస్సులో రుతుస్రావం అనుభవించవచ్చు. ఋతుస్రావం యొక్క ప్రారంభ వయస్సు అని పిలువబడే ఈ విషయం వివిధ కారణాలను కలిగి ఉంటుంది. బాలికలలో తక్కువ వయస్సులో రుతుస్రావం కావడానికి ప్రధాన కారణాలలో జన్యు సంబంధం ఒకటి. ఒక అమ్మాయి తల్లి లేదా పెద్ద స్త్రీ బంధువులు చిన్న వయస్సులోనే రుతుస్రావం ప్రారంభిస్తే, ఆమె కూడా ప్రారంభ రుతుస్రావం అనుభవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఒక అమ్మాయి తన ఋతు చక్రాన్ని ఎప్పుడు ప్రారంభిస్తుందో నిర్ణయించడంలో జన్యు సంబంధం ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

### తినే తిండి కారణమే

బాలికలలో ఋతుస్రావం ప్రారంభ వయస్సుకు దోహదపడే మరో అంశం ఊబకాయం. అధిక బరువు ఉన్న బాలికలు వారి



శరీరంలో అధిక స్థాయిలో ఈస్ట్రోజెన్ కలిగి ఉంటారు. ఇది మునుపటి వయస్సులో రుతుస్రావంను ప్రేరేపిస్తుంది. పేలవమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం కూడా ఊబకాయానికి దోహదం చేస్తాయి. ఇది ప్రారంభ ఋతుస్రావం ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. బాలికలలో తక్కువ వయస్సులో రుతుస్రావం జరగడంలో పర్యావరణ కారకాలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్లాస్టిక్, పురుగుమందులు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులలో కనిపించే ఎండోక్రైన్ అంతరాయం కలిగించే రసాయనాలకు గురికావడం శరీరంలోని హార్మోన్ల సమతుల్యతకు ఆటంకం కలిగిస్తుంది. ఇది ప్రారంభ ఋతుస్రావానికి దారితీస్తుంది. ఒత్తిడి, భావోద్వేగ కారకాలు కూడా బాలికలలో యుక్తవయస్సు ప్రారంభాన్ని ప్రభావితం చేస్తాయి. దీనివల్ల రుతుస్రావం చిన్న వయస్సులోనే ప్రారంభమవుతుంది.

### శరీరంలో మార్పులు

బాలికలలో ఋతుస్రావం యొక్క చిన్న వయస్సు శారీరక, భావోద్వేగ ప్రభావాలను కలిగి ఉంటుందని గమనించడం ముఖ్యం. ప్రారంభ ఋతుస్రావం ప్రారంభించే బాలికలు చిన్న వయస్సులోనే ఋతు లక్షణాలను నిర్వహించడం, వారి శరీరంలో మార్పులకు సర్దుబాటు చేయడం వంటి యుక్తవయస్సు సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. వారు యుక్తవయస్సు ప్రారంభానికి సంబంధించిన సామాజిక, భావోద్వేగ ఒత్తిళ్లను కూడా ఎదుర్కోవచ్చు. ఇది వారి ఆత్మగౌరవం, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

# విద్య ద్వారా నిరుపేద బాలికలకు సాధికారత

## టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు

ముందడుగు హైదరాబాద్:
టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక టి-హబ్‌లో జరిగిన గ్రాండ్ వార్షిక ఈవెంట్ స్ఫూర్తితో తన 10వ సంవత్సరాన్ని జరుపుకుంది. ఈ కార్యక్రమం వెనుకబడిన బాలికలు, వారి కుటుంబాలు, అంకితభావం కలిగిన వాలంటీర్లు, కోర్ టీమ్, ఉదార దాతలు, గౌరవనీయ భాగస్వాములు మరియు విశిష్ట ప్రముఖులు హాజరయ్యారు. బాలికల విద్యను ప్రోత్సహించడంలో ఫౌండేషన్ చేసిన కృషి యొక్క విశేషమైన ప్రభావాన్ని ప్రదర్శిస్తుంది. టచ్ ఎ లైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు



విభూతి జైన్ మరియు రినా హిందోచా ఈ మైలురాయిని ప్రతిబింబిస్తూ, "స్పర్శ అనేది ఒక సంఘటన కాదు; ఇది విద్య యొక్క పరివర్తన శక్తికి నిదర్శనం. న్యాయమైన విద్యతో వెనుకబడిన బాలికలకు సాధికారత కల్పించడం ద్వారా , మేము ఈ అమ్మాయిలకు మాత్రమే కాకుండా మొత్తం సంఘాలకు ఉజ్వల భవిష్యత్తును సృష్టించే ఒక స్పార్క్‌ను వెలిగిస్తున్నాం అన్నారు.

# కల్కి 2898 ఏడీ మూవీపై పుష్పరాజ్ రివ్యూ..!

## ఇక మాటలేవంటూనే నటీనటులపై ప్రశంసలు..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా.. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ కల్కి 2898 ఏడీ. ఈ భారీ బడ్జెట్ మూవీని వైజయంతి నిర్మించింది. శుక్రవారం విడుదలైన మూవీ బ్లాక్‌బస్టర్ హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నది. విజువల్ వండర్‌గా తెరకెక్కిన ఈ మూవీపై టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ స్పందించారు. మూవీ కళ్లు చెదిరే విజువల్స్‌తో కనులపండువలా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. 'సూపర్ హీరో తరహాలో తన ప్రతిభతో ఈ భారీ చిత్రానికి ప్రాణం పోసిన మిత్రుడు ప్రభాస్‌కు వందనాలు. అమితాబ్ బచ్చన్ గారు.. మీరు నిజంగా స్ఫూర్తిప్రదాత. ఈ సినిమాలో మీ నటన చూశాక ఇక మాటల్లేవ్. కమల్ సర్.. మీ పెర్ఫార్మెన్స్‌కు ప్రశంసలు. మీరు భవిష్యత్తులో ఇలాంటి పాత్రలు మరిన్ని చేస్తారని ఆశిస్తున్నా. డియర్ దీపికా అదరగొట్టావ్.





సునాయాసంగా నటించావు. దిశా పటానీ నువ్వు తెరపై ఎంతో ఆకర్షణీయంగా కనిపించావు డియర్. నటీనటులకు, టెక్నీషియన్లకు, ముఖ్యంగా సినిమాటోగ్రఫీ, ఆర్ట్, ఎడిటింగ్, మేకప్ విభాగానికి నిపుణులకు అభినందనలు. ఈ ఘనత వైజయంతీ మూవీస్‌కు, అశ్వనీదత్, స్వప్న దత్, ప్రియాంక దత్‌కు దక్కుతుంది. ఇండియన్ మూవీ ప్రమాణాలను పెంచే బృహత్తర చిత్రాన్ని అందించారు. నాగ్ అశ్విన్ ప్రతి సినిమా ప్రేమికులు ఆశ్చర్యపోయేలా మూవీని తెరకెక్కించారు. మూస ధోరణులను ధ్వంసం చేసి ఈ తరం కోసం సరికొత్త బాటలు వేసిన ఫిలిమేకర్ నాగ్ అశ్విన్. నా అభినందనలు. చివరగా అంతర్జాతీయ స్థాయి చిత్రాలకు ధీటుగా మన సాంస్కృతిక సున్నితత్వాలతో వెండితెరపైకి వచ్చిన చిత్రం కల్కి 2898 ఏడీ' అంటూ అల్లు అర్జున్ ట్వీట్ చేశాడు.